


# ఆత్మహత్య

శ్రీ వలివేటి బాలకృష్ణశర్మ

రామదాసుపంతులు ఆ వూళ్లో తెలుగుమేష్టరూ, కవీ, వైద్యుడూ, హరిదాసూ, ఒక్క Jounalist తప్ప మిగిలినవన్నీని. ఒహటో రెండో తక్కువ అయినా అరవయ్యేళ్లుంటాయి. కాని తెల్లగా లావుగా ఓ పదేళ్ళు చిన్నవాడిలాగుంటాడు. కనుబొమ్మలు పండిపోయి దుబ్బుగావుంటాయి. మీసాలులేవు. చిన్న క్రాఫింగు. చెవలకి తెల్లరాళ్ళ తమ్మెట్లూ—వాకట్లో ఈజీఛెయిర్‌లో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటూఉంటాడు. దీపం వెలుగులో రుద్రాక్షపూసల తావళంమీది బంగారుకట్టు జిగజిగ మెరుస్తూ వుంటుంది. కొంచెం ఎడంగా అతనిభార్య సావిత్రి పరుపుమీద కూచొని తాంబూలం వేసుకుంటూ మధ్యమధ్య పండిందో లేదో అని నాలిక చూసుకుంటూ ఉంటుంది. వయస్సు 30—40 మధ్య—Up-to-date get-up—నల్లగా చురుగ్గా వుంటుంది.

రామదాసు:—(చుట్టపొగ మెల్లిగా వదుల్తూ) ఎంత అన్యాయం! ఎంత విచారం!

సావిత్రి:—ఎందుకేమిటి విచారం!

రామదాసు:—సావిత్రీ, నిన్ను చూస్తే నాకు జాలిగా వుందిసుమా!

సావిత్రి:—పాపం ఎలాగయితే నేం! ఇన్నాళ్ళకి నామీద కనికరం కలిగింది.

రామదాసు:—కనికరమేమిటి చీల్చుకుంటే గుండె నీరయిపోతూ ఉంటే?

సావిత్రి:—అసలు సంగతేమిటో తేల్చండి వేగం!

రామదాసు:—ఏమిటి తేల్చడం? నా కేడుపుకూడా వొస్తూంది. నువ్వు నాలాగ చుట్ట కాల్చలేవు కదా!

సావిత్రి:—ఓస్! అంతేనా—మీరింకా ఊదొత్తులు ఆ చుట్టల్లో ఎక్కించి కాలుస్తారు గాని నేనయితే ఫస్టుగా కాలుస్తాను.

రామదాసు:—ఆ! నువ్వు కాల్చేదేమిటి? పేడ పిడకలు. పోనీ కవిత్వం చెప్పలేవు గద!

సావిత్రి:—ఇదేమిటి నాతో ఛాలెంజి చేస్తున్నారు? మీ హరికథల్లాంటివైతే రోజుకో రామాయణం రాసేస్తాను—

రామదాసు:—నాలాగ ఎవడేనా పాడగలడేమో రమ్మనూ మీసం మీద చెయ్యివేసి....

సావిత్రి:—అసలు మీకొహటి మీసాలేడిశాయేమిటి?

రామదాసు:—సావిత్రీ నువ్వెరగావు కాని నిన్ను పెళ్ళాడకముందు నల్లగా జానడేసి మీసాలూ, గిరజాలూ ఎలా వుండేవాణ్ణో తెలుసా?

సావిత్రి:—బ్రతికించారు. ఆ వేషాన్ని చూసి మీ మొదటిపెళ్ళాం కాబట్టి భరించింది. అయితే ఇప్పుడెంచాత తీయించేసారు?

రామదాసు:—ఏదీ ఏడాదయింది—మానాన్న పోయినప్పుడు తీయించేసాను.

సావిత్రి:—మీసాలు మీనాన్నకి మొక్కు చెల్లించేసారన్న మాట! అన్నట్టు మీరు నాటకాల్లో కొన్నాళ్ళు వేషాలు వేశేవారు కదండీ!

రామదాసు:—కొన్నాళ్ళేమిటి! ఇరవై ఏళ్లు అవిచ్ఛిన్నంగా నాటకాలూ, హరికథలూ....

సావిత్రి:—ఆడవేషాలా? మొగవేషాలా? అసలు మీ గొంతుక ఎవళ్లకేనా వినిపించేదీ?

రామదాసు:—ఫస్టుగా, ఓ హరిశ్చంద్రుడా. ఓ నలచక్రవర్తా- ఓ అర్జునుడా అన్ని వేషాలున్నూ— మొన్న నీ పెళ్ళికి డబ్బు కోసం రాణీప్రమీల వేషం వేశాను. ఫోటో చూశావు గదూ!

సావిత్రి:—ఓ అడిగేదేమిటి? బురాకీపిట్టలాగుంది. అంతకంటే భాగోతం వేషాలు నయం.

రామదాసు:—అందులోఉన్న కళనీకుతెలీదు కాబట్టి అలా అనేసేవు. అదే నీకు తెలుస్తేను....

సావిత్రి:—మిమ్మల్ని పెళ్ళాడకే పోదును. ఆ తూర్మాంఆచారినే పెళ్ళాడుదును. అన్నట్టు ఆచారి హరికధ ఎంతవరకూ వచ్చిందండీ!

రామదాసు:—పోనిస్తూ—ఈ వెధవలంతా కూడి కిర్రెక్కించి నాచేత ఈ హరికథలన్నీ వ్రాయించేసి ఇప్పుడు ఈ మదన కామే

శ్వరం అంతా తెగమింగి, నీ నెత్తిమీద తగలవేసుకో ఇవేం బాగా లేవంటున్నారు చూసావా?

సావిత్రి:—పోనీ పాపం! ఇహ ఇంట్లో భోజనంపెట్టి హరికథలు నేర్పుతారు అని "హిందూ"లో అడ్వర్టయిజ్ చెయ్యండి.

రామదాసు:—అదీ చేసాను కొన్నాళ్ళు. వెధవలంతా ఇల్లు చెడతిని తిడుతూ వెళిపోయారు.

సావిత్రి:—అసలు మీకీ తూర్మాం ఆచారి ఒక్కడే శిష్యుడేమో—

రామదాసు:—చంపేశావు—అవతల రష్యా ఇవతల ఆస్ట్రేలియా దాటితే అంతా మనవాళ్ళే.

సావిత్రి:—అసలు మీ స్వభావమే అదిలెండి—ఏమీ లేకపోయినా నా శిష్యులే అంటారు. అందుకనే తన్నులుకూడా తిన్నారు ఆ కవిరాజుచేత—వాళ్లేదో శతకం రాస్తున్నారట లెండి మీమీద.

రామదాసు:—ఒసీ ఏమేనా చెప్పు గాని ఇహ మరి వాళ్ళ వూసు మాత్రం నాదగ్గర ఎత్తకుమా?

సావిత్రి:—భయం కాజోలు పాపం ఇప్పుడు మిమ్మల్ని చూస్తే ఏడుపుకూడా వస్తూంది ఇంతో అంతో.

రామదాసు:—సావిత్రీ, నన్ను చూసి కనికరించిన దానివి ఈ ప్రపంచంలో నువ్వొక్కర్తివి కనిపిస్తున్నావు సుమా. ఇవాళ సుదినం—మంచి తరుణం మించిన దొరకదు (పాట) మంచిదీ.... నే.... లే.... చి.... న.... వే....!

సావిత్రి:—చచ్చేన్రా భగవంతుడా! ఇహ హరికథ చెబతారేమిటి?

రామదాసు:—చెబతానా? చెప్పి తీరుతానా? ఏమేనాచేస్తాను.... నీ దయ వుండాలి గాని.

(పాట) అదిర ఎంత పుణ్యాత్ముడనో చెవులమృతధారల గ్రోలె.

సావిత్రి:—చా లూరుకోండి. రాత్రి పన్నెండు గంటలప్పుడు పాటలేమిటి?

రామదాసు:—అదే నాకూ బాగున్నట్టు లేదు. వచనం చెప్పనా పౌరులారా! భక్తులారా అప్పుడు శ్రీరామచంద్రుండు వనములందుసీతకొరకై ఇట్లు విలపించే (రాగం తీస్తాడు)

సావిత్రి:—అందుకు బాగా పనికొస్తారు లెండి. ప్రస్తుతం ఒంటి గంటయింది. ఇహ పడుకోని తెల్లారి లేచి స్కూలుకి సెలవు పెట్టేసి ఏడుస్తూ కూర్చుందురు గాని.

రామ:—వెధవది ఏడుపుకోసం సెలవే పెట్టాలీ—రహస్యంగా ఏడ్చిందికని ఓగదికూడా ఇచ్చేరు ఒళ్ళు—

సావిత్రి:—అయితే ఇహనేం. ఏదో లేహ్యం పట్టుకుపోయి మాత్రల్లుచేస్తూ ఓపికున్నంత ఏడవండి

రామదాసు:—అలాగే కాని నాకొక్కటి మాత్రం మహా బాధిస్తూంది.

సావిత్రి:—ఎమిటో చెప్పండి నాకు నిద్దరొస్తుంది.

రామదాసు:—నే చచ్చిపోయాక ఈ సంసారం, ఈ యిల్లూ ఈ మందులూ, ఈ హరికథలూ ఏమవుతాయో చెప్పు. నే బ్రతికున్నప్పుడే ఇంతగా ఏడుస్తున్నావు కదా నే చచ్చిపోతే నువ్వు ఎంత ఏడుస్తావో....

సావిత్రి:—ఆ! రమ్మనీ—మీరు బ్రతికున్నారు కొబట్టి ఇలా ఏడుస్తున్నాను—ఇప్పుడూ అప్పుడూకూడా ఏడుస్తానేమిటి?

రామదాసు:—అంతేనా? అయితే ఇవాళ ఏంవారం చెప్పు

సావిత్రి:—ఇవాళసంతగదూ?

రామదాసు:—మనింట్లో భజనకదూ—అయితే లక్ష్మీవారం రేపో.

సావిత్రి:—శుక్రవారం, ఎల్లుండి శనివారం—తరువాత ఆదివారం.... మళ్లా....

రామదాసు:—ఆగు. అక్కడ ఆగు.

సావిత్రి:—ఏం? ఆవేళ ప్రాయోపవేశం చేసుకోని ప్రాణాలు వదిలేస్తారా ఏమిటి? చక్కా సెలవురోజు కూడాను. నిజంగా మీరంతవారే లెండి. ఏపనేనా చేస్తారు మీ సంగతేమిటి?

రామదాసు:—ఆహా సావిత్రీ—ధన్యోస్మి—ధన్యోస్మి నా మహత్తు గ్రహించదలిచిన దానివి ఇంతవరకూ నువ్వొక్క ప్రాణివి కనపడ్డావు సుమా

సావిత్రి:—నాకు మీ మహత్తు మొదటినుంచీ తెలుసు,

రామదాసు:—ఏదో నామీద ప్రేమకొద్దీ అంటున్నావు గాని నేనెంత వాణ్ణి? నాకొక్క వైద్యశాస్త్రి అన్న బిరుదే వుంది,

సావిత్రి:—మీరు వైద్యశాస్త్రులు. మీకాటికీ, మీ ఆముదం, మీ కస్తూరి మాత్రలూ ప్రసిద్ధి

రామదాసు:—ఏదో నన్నంతా కవి అంటారు ప్రేమకొద్దీ.

సావిత్రి:—మీరు కవిత్వం చెపతారు. కవీశ్వరులు.

రామదాసు:—టాంక్యూ. మీవంటి పతివ్రతలు ఈ వూళ్ళోనేకాదు. ముల్లోకాల్లోనూ లేరు

(పద్యం) "లేరు మీవంటి సాధ్వులో వీరపత్నీ"

సావిత్రి:—ప్రతిదానికీ పద్యాలేనా

రామదాసు:—చూశావా ఆశుకవిత్వం అలవాటయిపోయింది. మొన్న పోలీసు జవానుకి రెండణాలు జీతం ఎక్కువయితే వాడిమీద పద్యాలు వ్రాశేను.

సావిత్రి:—అయితే మీరు చచ్చిపోయిన వెంటనే మీమీద ఓ పుస్తకం వ్రాస్తాను లెండి.

రామదాసు:—మరిచిపోతావేమో?

సావిత్రి:—మిమ్మల్నా మరిచిపోడం?

రామదాసు:—పోనీ ఇప్పుడే వ్రాయకూడదూ? లేకపోతే నేనే వ్రాసి మరీ చచ్చిపోతే?

సావిత్రి.—అబ్బ ఊరుకుందురూ మీరు హరికధ తప్ప మరేం వ్రాయలేరు.

రామదాసు:—మరెంతవేగం రాస్తావో నీదయ.

సావిత్రి:—మీ రెంతవేగం ప్రాణాలు విడుస్తారో....

రామదాసు:—ఒహా వేళ నేను ఇప్పుడే చస్తాననుకో

సావిత్రి:—నేనూ ఇప్పుడే వ్రాస్తాను.

రామదాసు:—నామీదే? పద్యాలే? పుస్తకమే? నిజంగా నిన్ను పెండ్లాడ్డంవల్ల నాజన్మతరించిందిసుమా- (కుర్చీ లోంచి లేచిపోయి) (పాట) జన్మతరియించెన్—నేటికినా....

సావిత్రి:—మరి ఇహ ఆలస్యమెందుకూ?

రామదాసు:—అన్నట్టు (రిష్టువాచీ చూపించి) టైముచూడూ వెధవది నాకు కనపడదు.

సావిత్రి:—(చూసి) ఒంటిగంటన్నర.

రామదాసు:—వర్జం పోయిందన్నమాట! శుభస్యశీఘ్రం అన్నాడు. వేగంతా డొకటి తీసుకురా. ఈలోపల మదనకుమేశ్వరీ కొంచెం వేసుకుంటాను.

సావిత్రి:—(లోపలికివెళ్ళి ఓ పెద్ద చేంతాడు తెస్తుంది.)

రామదాసు:—గట్టిగా వుంటుందా?

సావిత్రి:—మిమ్మల్ని చంపడానికి ఇది చాలులెండి.

రామదాసు:—సరిపోతుందిలే. చూసావా? ఇప్పుడు నువ్వు నామీద పుస్తకం రాస్తానన్నావు కాబట్టి చచ్చిపోతున్నాను. తప్పకుండా రాస్తావుకదూ?

సావిత్రి:—అలాగే వేగం కానీండి.

రామదాసు:—అయితే ఈతాడు నామెడకు చుట్టపెట్టు (కూచుంటాడు.)

సావిత్రి:—(తాడుచుట్టి రెండుకొసలూ రెండుచేతులకీ అందిస్తుంది.)

రామదాసు:—(చేతుల్తో పట్టుకుని) (పాట) సెలవా....ఇక నాకు సెలవా (కాల్తో లయవేస్తాడు.)

సావిత్రి:—బిగించండి. మరి అట్టేసేపు పాడక—

రామదాసు:—అన్నట్టు ఉండు ఒక్కమాటు భగవంతుని ప్రార్ధించుకోనీ- అఖరుసారి.

(రెండుచేతులూ తాళ్ళతోనే జోడిస్తూ కళ్ళుమూసి.) శ్రీరాఘవం- (పెద్దరాగం తీస్తాడు.)

సావిత్రి:—మరి ఇంత సేపయితే ఎలాగు? నాకు నిద్దరొస్తూంది. వేగం తెమలండి. మీ సంగీతం అంతా ఇక్కడేనా? ఆ యమలోకం వెళ్లాక ఎలాగూవుంది?

రామదాసు:—(అలా కళ్ళుమూసుకోనే చేతులు విప్పకుండా సావిత్రి వేపు తిరిగి) ఇంకా ఇప్పుడేంచూసావు? పదేళ్ళక్రిందట నాఆటా- స్టేజిమీద గుమ్ముగా వుండేవి.

సావిత్రి:—పాపం జరిగింది. మరి విచారించకండి- వేగ ఏదో శ్లోకం చదివి టఫీమనిపించండి.

రామదాసు:—(రొండుశ్లోకాలు చదివి) ఇహసరి— అ ఖ రు సా రి— నీమొహంచూడనియ్యి.

సావిత్రి:—(ఎదురుగా వెళుతుంది.)

రామదాసు:—(దగ్గి కళ్ళుతుడుచుకుంటూ గద్గదస్వరంతో రాగవరసని) ఓ నా ప్రియమైన భార్యాతిలకమా మందరదనా? అందాలరాశివగు నిన్ను ఇందువిడచి నేనెట్లు మందునేమందు? అన్నట్టు మందంటే జ్ఞాపకమొచ్చింది- నామందులు ఏవరికీ ఇచ్చివేయకుమా? మళ్ళా జన్మలోనేనా వచ్చి వైద్యంచేసుకుంటానూ కవిత్వంమాత్రంవొద్దు.

సావిత్రి:—మీవాళకం చూస్తే చచ్చేటట్టులేదు. ఎందుకీ విద్దరదండుగ?

రామదాసు:—సుదతీమణీ ఎందుకింతకోపము (పద్య) ఆగ్రహించిన దీనుండు ఆ గ గ ల డె? శ్రీమద్రమారణగోవిందోహరి గోవిందా అందరూ అనండి మరేంతప్పులేదు—

సావిత్రి:—ప్రాణాలుపోయేముందర అందరూ ఇలాగే అంటారేమిటండీ?

రామదాసు:—ఆ! అందరికిన్నీ—అదెంతవాడికి? అందరూ రామా అంటే ఇంకేముంది? ఎవరో నాలాంటి వాళ్ళకీ పుణ్యం....

సావిత్రి:—సరే ఇహ బిగించండి ఆ తాడు—

రామదాసు:—(కొంచెం బిగించి) చచ్చిపోతానేమో?

సావిత్రి:—మరెందు కయితే ఇదంతాను?

రామ:—ఓహో అవునుగదూ? అన్నట్టు నే చచ్చిపోతే స్వర్గానికి వెళతానా? లేకపోతే నరకానికి పోతానంటావా?

సావిత్రి:—ఆ! మీకు స్వర్గమొహాటి? మీరుచేసిన వెధవ పనులకి,

రామ:—ఓపుణ్యంఉంటుంది. ఎవళతోనూ మాత్రం చెప్పకుమా ఇవన్నీ: —మరి వేగం చచ్చిపోతాను. కావలిస్తే- ఇలాంటి వన్నీ వింటే మరెవరూ వైద్యానికి పిలవరు.

సావిత్రి:—మీరు మాటలకే గాని పనికి పనికిరారు. ఇలా తెండి నేను బిగిస్తాను—

ఆతాళ్ల తీసుకొని గట్టిగా బిగిస్తూంది)

రామదాసు:—మ....రి....చి—పో....కు (చెప్పుతూ ఉంటాడు)

పైనుంచి తలుపు చప్పుడు—సావిత్రి తాడు వొదిలి తలుపు తీస్తుంది. రామదాసు ఆలా నేలమీద వాలిపోతాడు—గట్టిగా ఊపిరితీస్తూ—)

ప్రవేశం. గోపాలం సిగరెట్టుపెట్టే మూటా ఓమూల పెట్టి)

గోపాలం:—ఏమిటి సావిత్రీ నీ మొగుడలా పడివున్నాడు డోసు ఎక్కువయిందేమిటి?

సావిత్రి:—లేదన్నయ్యా! ఆత్మహత్యచేసుకుంటారుట వద్దంటే వినరు.

గోపాలం:—అదాసంగతి! (రామదాసు దగ్గరికివెళ్ళి సిగరెట్టు పొగ మొహంమీద వొదుల్తాడు.)

రామదాసు:—(కళ్ళువిప్పి.) ఓహోగోపాలం! ఎప్పుడేనిటిరావడం? ఓ దమ్ము ఇలా ఇయ్యి సిగరెట్టుకాల్చి చాలారోజులయింది?

గోపాలం:—అయితే బావా, ఇదేమిటీ వికారం? ఇంత బతుకూ బతికి ఇంటివెనకాలా చస్తావూ?! పబ్లిగ్గా చావరాదూ?

రామదాసు:—భేష్- మంచిసలహా; రేపు పబ్లిగ్గా పెద్దసభచేసిమరీ చస్తాను, పద, పోయి పడుకుందాం- సావిత్రీ నువ్వుకూడా పద—

(అందరూ వెళ్ళిపోతారు.)

(తెర)


"అద్దమేలంటాది అందాలు దెలుప"

టి. సి. ఎన్.

ఆభరణాలంకారపు టందాన్ని తెలుపడానికి అద్దమెందుకు?

మెడ చెయినులు





2 సంవత్సరములు గ్యారంటీ

కాంతిలోను, వన్నెలోను బంగారు చెయినుల కేమాత్రము తీసిపోవు. నలు పెక్కవు.

| పెద్ద సైజు | | | చిన్న సైజు | | |
|---|---|---|---|---|---|
| 1 పేట | 1-కి | రూ. 7—0—0 | 1 పేట | 1-కి | రూ. 5—0—8 |
| 2 పేటలు | 1-కి | 14—0—0 | 2 పేటలు | ,, | 10— —0 |
| 3 పేటలు | 1-కి | 21—0—0 | వి. పి. ఖర్చులు | | 0—8—0 |
| 4 పేటలు | 1-కి | 28—0—0 | | | |

మా చక్కని బొమ్మల క్యాటలాగు ఉచితము, మీరువ్రాయు ఆర్డరు జాబులయందు "చిత్రగుప్త" పత్రికపేరు నుదహరించిన మా ధరలమీద రూపాయకు ఒక అణావంతున తగ్గించ బడును.

టి. సి. నాగలింగప్ప అండు కంపెని,

280, వాల్‌టాక్స్ రోడ్, పార్కుటవున్ పోస్టు, మదరాసు.

ఏజంట్లు:— గుప్తా అండ్ కో, మెయిన్‌రోడ్. కాకినాడ

కె. వి. రమణమూర్తి, తెనాలి.

యస్. యస్. గుప్తాగారు, జనరల్ ఏజంటు, మడకశిరా.